క్లుప్తంగా

దొంగతనం కేసులో నిందితుడి రిమాండ్

దామెర : దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై కొంక అశోక్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వర్కాటి వీరస్వామి శుక్రవారం తన ఇంటికి తాళంవేసి వ్యవసాయ పనులపై బయటికి వెళ్లాడు. గమనించిన గ్రామానికి చెందిన దామెర సుకుమార్ ఇంటి తాళం, బీరువా తాళం ధ్వంసం చేసి రూ.80,000 అపహరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా సుకుమార్‌పై అనుమానం వచ్చిందన్నారు. దీంతో విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుని దొంగిలించిన డబ్బును తిరిగి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితుడు సుమన్‌ను పోలీస్‌లు కోర్టుకు హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

పశువులపై హైనా దాడి

ఒక పశువు మృతి, రెండింటికి గాయాలు

మామునూరు : ఐనవోలు మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన చార్ల నారాయణ, బాలబోయిన లింగయ్య ఇద్దరు రైతులు శనివారం ఉదయం ఆవులను పచ్చిక మేతకు తీసికెళ్లారు. ఈ క్రమంలో మధ్యాహ్నం పశువులపై హైనా దాడి చేయగా చార్ల నారాయణకు చెందిన పశువు అక్కడికక్కడే మృతి చెందింది. బాలబోయిన లింగయ్యకు చెందిన రెండు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. విషయం తెలుసుకున్న ఐనవోలు మండల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బలరామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం పాదముద్రలు సేకరించి హైనాగా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

వేట సామగ్రి స్వాధీనం

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో అటవీ జంతువుల వేటగాళ్ల నుంచి వేట సామగ్రిని స్వాధీనం చేసుకుని శనివారం హనుమకొండ జిల్లా అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ మైసయ్యకు అందజేసినట్లు ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ హనుమకొండ జిల్లా సభ్యుడు మారేపల్లి సునీల్ తెలిపారు. ఉడుతలను, పక్షులను వేటాడే వేట సామగ్రి వలలను, స్పాంజీలను స్వాధీనం చేసుకున్నట్లు మైసయ్య తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు డెస్కుల అందజేత



శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చైత్రశ్రీ ఫౌండేషన్ కెనడా వారు శనివారం 5 డబుల్ డెస్క్ బెంచీలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వరరావు చైత్రశ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మార్గం రమకు అభినందనలు తెలిపారు. అనంతరం ఫౌండేషన్ తరుపున ప్రాతినిధ్యం వహించిన భాగ్యలక్ష్మి, సంధ్యారమేశ్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముల్కనూరులో పెద్దమ్మతల్లి బోనాలు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములకనూరులో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ముగిసిన సందర్భంగా శనివారం గ్రామ మహిళలు పెద్దెత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు. నైవేద్యం వండిన బోనాలతో డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

గ్రామకమిటీలు కీలకపాత్ర పోషించాలి



పరకాల : ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో గ్రామకమిటీలు కీలకపాత్ర పోషించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ పిలుపునిచ్చారు. పరకాల మండలం వెంకటాపురం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మంగళపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా సిలువేరు హరీశ్, కోశాధికారిగా దొగ్గల రాజ్‌కుమార్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల నాయకులు కుమార్, బాబు పాల్గొన్నారు.

దామెర ఎంపీడీఓగా విమల

దామెర : ఎంపీడీఓగా గజ్జల విమల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎంపీడీఓగా ఉన్న కల్పన సెలవుపై వెళ్లగా వేలేరు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న విమలను దామెర ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీచేశారు.

'టెన్త్' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఉదయం, సాయంత్రం క్లాస్‌లు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయుల కృషి
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు



విద్యార్థులకు స్నాక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

వేలేరు : పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అంతేగాక విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా పాఠాలు బోధిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతీరోజు పదో తరగతి విద్యార్థులకు మెనూ ప్రకారం వివిధ రకాల స్నాక్స్ కూడా అందిస్తుంది.

180 మందికి పైగా విద్యార్థులు

మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కేజీబీవీ పాఠశాల ఉంది. అందులో పీచర పాఠశాలలో 37 మంది పదో తరగతి విద్యార్థులు, వేలేరు 49, మల్లికుదుర్ల 32, కన్నారం 08, ఎర్రబెల్లి 18, కేజీబీవీ పాఠశాలో 37 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేసిన అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ప్రణాళిక ప్రకారం విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతంలోని ప్రశ్నపత్రాలను చూపించి స్లిప్‌టెస్టులు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. అలాగే చదువులో వెకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పదో తరగతి విద్యార్థుల దృష్టి చదువుపై మళ్లించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

సందేహాలను నివృత్తి చేస్తున్నారు



ప్రతీరోజు పాఠశాల సమయం కంటే గంట ముందుగానే పాఠశాలకు వస్తున్నాం. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టలో వచ్చిన సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందజేస్తున్నారు

- యామిని, పదో తరగతి విద్యార్థిని, పీచర

ప్రైవేట్‌కు దీటుగా ఫలితాలు



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించేలా ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుంది. విద్యార్థులకు గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు ఇష్టపడి చదివేలాగా ప్రోత్సహిస్తున్నాం. ఈసారి వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం

- రాజన్న, వేలేరు, హైస్కూల్ పీజీహెచ్ఎం

మండల కేంద్రంగా ప్రకటించాలి



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్ : ఉప్పల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల సాధన సమితి ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు శనివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. స్థానిక కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై అర్ధనగ్నంగా బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టి నినాదాలు చేశారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఉప్పల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత నాలుగు రోజులుగా ఆందోళనలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన కరువైందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి ఉప్పల్, చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఉప్పల్‌ను మండల కేంద్రంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్, గెజిట్ విడుదల చేయాలని కోరారు. ధర్నా, రాస్తారోకోతో హుజూరాబాద్–పరకాల మార్గంలో రోడ్డు కిరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఆందోళన విరమింపజేశారు. మండల సాధన సమితి, జేఏసీ నాయకులు, గ్రామస్తులు ముజీబ్ హుస్సేన్, సంపత్‌రావు, రాజు, దేవేందర్‌రావు, రాంచందర్, క్రాంతికుమార్, రాజమౌళి, రాణాప్రతాప్, రఘు, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్‌తో మిర్చి కొనుగోళ్లు చేపట్టాలి



నడికూడ : మార్క్‌ఫెడ్‌తో మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల్ కిషన్ రావు డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్‌తో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్లో ధర చూస్తే మిర్చి రైతులకు కంటిమీద కునుకు లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రాజు, రాజయ్య, శంకర్‌రావు, రాజకుమార్, దేవారావు, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



ప్రమాదకరంగా గేట్‌వాల్వ్ గుంత

వేలేరు : మండలంలోని షోడాషపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న ప్రధాన రహదారిపై పలుచోట్ల మంచినీటి పైప్‌లైన్ గేట్‌వాల్వ్ గుంతలపై పైకప్పులు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గుంతలు ఉన్న ప్రాతంలో స్థానికులు బండరాళ్లను అడ్డుగా పెట్టారు. అటువైపుగా ప్రయాణించే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాన్ని నడిపినా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. వెంటనే గ్రామపంచాయతీ, అధికారులు స్పందించి గేట్‌వాల్వ్ గుంతలపై పైకప్పులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థికి రేవూరి పరామర్శ

పరకాల : కేసముద్రం వద్ద రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన పరకాలకు చెందిన విద్యార్థి అరవింద్‌ను స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శనివారం పరామర్శించారు. హనుమకొండలోని గార్డెన్ ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే.. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అదే విధంగా విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. అరవింద్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

వాలీబాల్ క్రీడా పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏసీపీ, తదితరులు

వరంగల్ క్రైం: ఈనెల 16, 17వ తేదీల్లో మూల వెంకట్‌రెడ్డి స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను హనుమకొండలోని జేఎన్ఎస్ మైదానంలో నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు స్మారక వాలీబాల్ పోటీల వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాలీబాల్ పోటీల విజేతలకు మొదటి స్థానంలో నిలిచిన టీంకు రూ.20 వేలు, రెండవ స్థానంలో టీంకు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, నాల్గో స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ నాగయ్య, బొబ్బిలి వెంకట్‌రెడ్డి, బొబ్బిలి లింగారెడ్డి, సుధాకర్, సారంగపాణి, ద్రోణాచారి, శేఖర్‌గౌడ్, సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు: ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రలో నిర్వహించిన ఆత్మకూరు, దామెర మండలాల ముఖ్యకార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నారని, బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు, రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ఇచ్చిన మాట తప్పకుండా హామీలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదన్నారు. పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. అనంతరం 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు కాంగ్రెస్ కై వసం కావాలన్నారు. అందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డి, నాయకులు పరికిరాల వాసు, బరుపట్ల కిరీటి, మాజీ సర్పంచ్‌లు పర్వతగిరి రాజు, కంచ రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరితంగా బీసీ జనాభా తగ్గించారు



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

నయీంనగర్: సమగ్ర కుటుంబ సర్వేలో బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీ జనాభా 58 శాతం ఉండగా 45శాతం మాత్రమే ఉందని తక్కువ చేసి చూపించారని మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య విమర్శించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపులను రాజకీయంగా దెబ్బకొట్టడానికే సమగ్ర కుటుంబ సర్వేలో 13లక్షల జనాభాను తగ్గించి 15లక్షలకు కుదించారని పేర్కొన్నారు. ఇప్పటికే 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. సమావేశంలో కుల సంఘం నాయకులు గైనేని రాజన్, కటకం పెంటయ్య, బండి కుమారస్వామి, రవికుమార్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



విగ్రహాలను ఆలయానికి తీసుకొస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భజనమండలి భక్తులు కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కడారి రఘునాథరావు, కమిటీ చైర్మన్ మోహన్‌రావు వేర్వేగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే దుబాసి మానస నవీన్ దంపతులు మహా అన్నదానం చేపట్టారు.

సుదర్శన్‌రెడ్డి గొప్ప కార్యదక్షుడు

- గోమాత పుస్తకావిష్కరణలో మాజీ వీసీ జయరామరెడ్డి



గోమాత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయరామరెడ్డి తదితరులు

కమలాపూర్ : తొంబై ఏళ్ల వయసులోనూ తన మేధాశక్తిని ఉపయోగించి గోమాత పద కావ్యాన్ని రచించిన పింగిలి సుదర్శన్‌రెడ్డి గొప్ప కార్యదక్షుడని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ జయరామరెడ్డి కొనియాడారు. మండలంలోని వంగపల్లిలో ప్రొఫెసర్ డాక్టర్ పింగిలి రమేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వంగపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పింగిలి సుదర్శన్‌రెడ్డి రచించిన గోమాత పుస్తకాన్ని శనివారం ఆయన వంగపల్లిలో ఆవిష్కరించి మాట్లాడారు. తన ఉద్యోగ జీవితంలో ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత సుదర్శన్‌రెడ్డిదని అన్నారు. తెలుగు భాషపై ఉన్న మమకారంతో సుదర్శన్‌రెడ్డి పలు కావ్యాలు రచించి పలువురు ప్రముఖుల మన్ననలు పొందారన్నారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ కిషన్‌రావు మాట్లాడుతూ.. సుదర్శన్‌రెడ్డి రచించిన కావ్యాలు తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచాయని, గోమాత పద కావ్యం మానవుల జీవితానికి దగ్గరి అనుబంధంగా ఉందని అన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు రాజ్‌మహ్మద్, ఏసీపీ జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు ముఖ్య అతిథులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు శాలువాలతో సత్కరించి ప్రశంసపత్రాలు అందజేశారు.

న్యాయం కోసం సుప్రీంకోర్టుకు సైకిల్‌యాత్ర



కమలాపూర్ : జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రఘునాథపల్లికి చెందిన బొమ్మినేని చంద్రారెడ్డి అనే వృద్ధుడు న్యాయం కోసం సుప్రీంకోర్టుకు చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం కమలాపూర్‌కు చేరింది. ఈ సందర్భంగా చంద్రారెడ్డి స్థానిక మీడియాతో మాట్లాడారు. గత సర్పంచ్ ఎన్నికల్లో తన భార్య సరోజన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిందని, ప్రత్యర్థి ఒకరు తనకు డబ్బు ఆశ చూపి తన భార్యతో నామినేషన్ విత్‌డ్రా చేయించాలని తీవ్ర ఒత్తిడి చేశారని ఆరోపించారు. తాను అందుకు ఒప్పుకోకపోవడంతో తనను కిడ్నాప్ చేశారని, ఆ తర్వాత తనను చంపుతామని బెదిరించి తన భార్యతో నామినేషన్ విత్‌డ్రా చేయించారన్నారు. ఈ ఘటనపై తాను సంబంధిత అధికారులు, పోలీసులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. చివరకు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తాను న్యాయం కోసం శుక్రవారం మధ్యాహ్నం సైకిల్ యాత్ర చేపట్టి సుప్రీంకోర్టుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

'బేటీ బచావో–బేటీ పడావో'పై అవగాహన



అవగాహన ర్యాలీ కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు

నడికూడ : మండలంలోని పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటి పడావోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. ఆడపిల్లల చదువు అవనికి వెలుగు అని, ఆడపిల్లలను రక్షించాలని అన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను పురుషులతో సమానంగా చూడాలని అన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1041098100 లేదా 181కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమ, పద్మ, కవిత, ప్రదీప్, రాజేశ్, నిరోషా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సరిత, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. బాణసంచా పేల్చి నినాదాలు చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఢిల్లీ ప్రజల నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు.

- సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు : సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు



దామెరలో..



పరకాల : బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు



శాయంపేటలో..



కమలాపూర్‌లో..

ప్రజా వ్యతిరేక, దోపిడీ వర్గాల కేంద్ర బడ్జెట్

హన్మకొండ: ప్రజా వ్యతిరేక, దోపిడీ వర్గాలకు అనుకూల బడ్జెట్‌ను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని ఎంసీపీఐ (యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి విమర్శించారు. ఎంసీపీఐ(యూ), ఆర్ఎంపీఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసం, సంపన్న వర్గాల కోసమే కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా మొదటి నుంచి విభజించు పాలించు అనేవిధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి విభజన హామీల అమలుకు కేంద్రం సహకరించడం లేదని ఎద్దేశాచేశారు. కార్యక్రమంలో నాయకులు నీల రవీందర్, వక్కల కిషన్, దామరకొండ రమేష్, మట్టెడ మొగిలి, శ్రీకాంత్, శిరీష, సిద్దు, ప్రేమలత పాల్గొన్నారు.